ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం

- పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు
- తరలివచ్చిన ప్రజలు
- వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ



పేరుకలపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఇంటింటికి వైద్యులను పంపి వైద్య సేవలు అందిస్తున్నారని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా దుగ్గిరాల మండలం పేరుకలపూడిలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరాన్ని తహసీల్దార్ మల్లేశ్వరి పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పౌష్టికాహార కిట్లను అందజేశారు. తహసీల్దార్ మల్లేశ్వరి మాట్లాడుతూ ఇంటింటికి తిరిగే సమయంలో ఏమైనా సమస్యలు గుర్తిస్తే ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రత్యేక వైద్యుల చేత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారని, శస్త్రచికిత్స అవసరమైతే ఆరోగ్యశ్రీ వర్తించే కార్పొరేట్ ఆసుపత్రుల్లో పూర్తిగా ఉచితంగా వైద్యం చేయిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పేరుకలపూడి సర్పంచ్ గంపల గంగాధర్, వైద్యులు ప్రభాకర్, శివ, కె.తాజుద్దీన్, మొహమ్మద్ అబ్దుల్ రహమాన్, సుకన్య, వివి.కర్ణ, ఇందిర, వైఎస్సార్ సీపీ నాయకులు నూతలపాటి కేశవరావు, ఉప సర్పంచ్ తాడిబోయిన గంగాధర్, అల్లు మహేష్, బొల్లా చక్రవర్తి, కోటేశ్వరరావు, మేకల సురేష్, వినయ్, పంచాయతీ కార్యదర్శి వి.స్రవంతి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో సంపూర్ణ ఆరోగ్యం

తాడికొండ: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా ప్రతి కుటుంబంలో సంపూర్ణ ఆరోగ్యం ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తాడికొండ మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ అన్నారు. సోమవారం తాడికొండ సచివాలయం–2 పరిధిలోని ఏఏ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంచేందుకు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్షా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుండటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సహకారంతో కొనసాగుతున్న ఈ వైద్య శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని, ముందస్తు సమాచారం ఇచ్చి శిబిరాలు నిర్వహిస్తున్న కారణంగా భారీ ఎత్తున ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. సోమవారం నిర్వహించిన వైద్య శిబిరానికి 500 మందికి పైగా రోగులు పాల్గొని ఉచితంగా పరీక్షలు చేయించుకుని మందులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజినీ, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ కార్యదర్శి పిట్టు శ్రీనివాసులురెడ్డి, తోకల నరసింహారావు పలువురు అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ఫిరంగిపురం: మండలంలోని నాలుగు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్నట్లు ఫిరంగిపురం పీహెచ్‌సీ సెక్టారు వైద్యురాలు పి.ఎస్తేరురాణి చెప్పారు. సోమవారం 113 తాళ్లూరు, శిరంగిపాలెం, రేపూడి, అమీనాబాద్ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల ఆరోగ్య వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఎప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించేది తెలియజేస్తూ కూపన్లు అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్ హెచ్‌పీలు అనూష, రాణి, సువర్ణ, ఏఎన్‌ఎంలు భారతీ జ్యోతి, అరుణ, ఆంతోనిరాణి, ఆనందకుమారి, సరోజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




తాడికొండ వైద్య శిబిరంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



అమీనాబాద్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జీజీహెచ్ అభివృద్ధికి దాతల విరాళం



గుంటూరుమెడికల్: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన జన్మదినోత్సవం సందర్భంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.50వేల ఆర్థికసాయం చేశారు. గ్లోబల్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులు రూ.10 వేలు, జీజీహెచ్ ఆరోగ్యశ్రీ సిబ్బంది రూ.10వేలు, మమతా మెడికల్స్ నిర్వాహకులు చంద్రశేఖర్ రూ.10 వేలు, జయలక్ష్మి ఏజెన్సీస్, ఐక్యత ఆరదో నీడ్స్, రైన్‌బో బ్లడ్ బ్యాంక్ రూ. 5వేలు, సిరక్స్ బయో మెడికల్ సిబ్బంది రూ.5 వేలు విలువగల ఫింగర్ పల్స్ ఆక్సీమీటర్స్ అందజేసి, డాక్టర్ కిరణ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేణు, కార్తిక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

తెనాలి రూరల్: కరోనా సందర్భంగా రద్దు చేసిన అనేక ప్యాసింజర్ రైళ్ల కారణంగా సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. తెనాలి రైల్వేస్టేషన్ మేనేజర్ టీవీ రమణను ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం కలిశారు. ఎక్స్‌ప్రెస్‌ల్లో జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని కోరారు.

క్లుప్తంగా

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన నీరు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఫిరంగిపురం: ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని వేమవరం గ్రామానికి వెళ్లే దారిలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచింది. గ్రామంలోకి వెళ్లేందుకు ఇదొక్కటే మార్గం. ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, కూలీలు నీటిలో వెళ్లలేక రైల్వేట్రాక్ దాటుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి నీటిని తోడించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉండవల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు విద్యుత్ సరఫరా చేయాలి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ స్కీమ్‌కు విద్యుత్ సరఫరా అందజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరావు మాట్లాడుతూ ఉండవల్లిలోని పంపింగ్ స్కీమ్‌కు నాలుగు రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోటర్లు పనిచేయడం లేదని, ఈ పంపింగ్ స్కీమ్ మీద ఆధారపడి సుమారు 300 ఎకరాలలో రైతులు పంటలు సాగుచేస్తున్నారని అన్నారు. పంట పాడైపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వెంటనే అధికారులు పంపింగ్ స్కీమ్‌కు విద్యుత్ సరఫరా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, తాడేపల్లి మండల రైతు సంఘం కార్యదర్శి మోదుగుల శ్రీనివాసరెడ్డి, ఉండవల్లి గ్రామ రైతు సంఘం ఉపాధ్యక్షులు పి.వీరాస్వామి, ఇస్సాకు, వేమా రామారావు, పెద్ద బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూకు అవార్డు



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీని కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రతినిధుల బృందం సోమవారం సందర్శించింది. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కేంబ్రిడ్జి అసెస్‌మెంట్ పరీక్షను విజయవంతంగా అందించినందుకు తమ విశ్వవిద్యాలయం గెలుచుకున్న అవార్డు అందజేశారని తెలిపారు. కేఎల్ యూనివర్సిటీ ఎమర్జింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్ 2022–23గా అవార్డు పొందిందని అన్నారు. అనంతరం కేంబ్రిడ్జి అసెస్‌మెంట్ ప్రతినిధుల బృందం అవార్డు ధ్రువీకరణ పత్రాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్‌లకు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థిని మృతి

మంగళగిరి: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బీటెక్ చదువుతున్న విద్యార్థిని మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగర పరిధిలోని నూతక్కికి చెందిన అన్నపురెడ్డి (లోహిత) విజయవాడ ఎనికేపాడులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతుంది. కొద్దికాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కడుపు నొప్పి తట్టుకోలేక సెప్టెంబర్ 28న ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు చినకాకానిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనదారులపై మందుబాబుల దాడి

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు భగత్ సింగ్ నగర్ వద్ద ఆదివారం రాత్రి మందుబాబులు అలజడి సృష్టించారు. ఓ మహిళ గాయపడిన ఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధిలోని చినకాకానికి చెందిన గుమ్మా బుల్లెమ్మ, అంకమ్మరావు దంపతులు యర్రబాలెం అంకమ్మ తల్లి కొలుపులకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా ద్విచక్రవాహనాలపై బుల్లెమ్మ దంపతులు ఒక ద్విచక్రవాహనం, బుల్లెమ్మ సోదరుడు మరో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రైల్వేగేటు వద్ద ఉన్న ఇద్దరు మందుబాబులు బుల్లెమ్మ సోదరుడిని ఆపి డబ్బులు లాక్కునేందుకు యత్నించి అతనిపై దాడికి దిగారు. వెనుక వస్తున్న బుల్లెమ్మ, అంకమ్మరావులు అడ్డుకుని ప్రశ్నించడంతో వారితో వివాదానికి దిగారు. వివాదం ఎందుకని బుల్లెమ్మ దంపతులు ద్విచక్రవాహనం ఎక్కగా ఓ యువకుడు బుల్లెమ్మ జడ పట్టుకుని లాగడంతో ద్విచక్రవాహనం నుంచి కిందపడడంతో గాయాలయ్యాయి. బుల్లెమ్మ దంపతులు పట్టణ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్



కృపమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

తాడేపల్లిరూరల్: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆకస్మికంగా మృతిచెందిన ముగ్గు రోడ్డు ప్రాంతానికి చెందిన ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విధి నిర్వహణలో కృపమ్మ మృతి చెందడం బాధాకరం అన్నారు. ఆశా వర్కర్ల చేత పని చేయిచుకుంటూ తక్కువ వేతనం ఇవ్వడం సరికాదని, వారికి కనీసం రూ.21 వేలు వేతనాన్ని అందజేయాలని అన్నారు. అతి చిన్న వయసులో ఆకస్మికంగా కృపమ్మ మృతి చెందడం ఆమె కుటుంబానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, సీపీఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ధనలక్ష్మి, జిల్లా అధ్యక్షులు కొప్పనాతి లక్ష్మి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 13 అర్జీలు



అర్జీదారుతో మాట్లాడుతున్న గీతాంజలి శర్మ

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన సమావేశం జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ప్రజల నుంచి అర్జీల్ని స్వీకరించారు. ఆయా సమస్యల్ని వారి నుంచి వివరంగా తెలుసుకున్నారు. నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వివిధ గ్రామాల్నుంచి వచ్చిన ప్రజలు మొత్తం 13 అర్జీల్ని సమర్పించారు.

==స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన సమావేశంలో మండల తహసీల్దార్ కె.రవి బాబు అర్జీల్ని స్వీకరించారు. ప్రజలు ముందుగా తమ పరిధిలోని సచివాలయంలో అర్జీల్ని సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాకపోతేనే తమ వద్దకు రావాలని ఆయన సూచించారు.

మురుగు కాల్వలు బాగు చేయించండి.

తెనాలి అర్బన్: సుల్తానాబాద్‌లోని మురుగు కాల్వల్ని బాగు చేయించాలని కోరుతూ ఆ ప్రాంతవాసులు మున్సిపల్ మేనేజర్ అప్పలరాజుకు వినతి పత్రం ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక అర్జీ వచ్చిందని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో పురపాలక సంఘ పరిధిలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని పోస్టాఫీసు వద్ద ఓ నివాసంలో ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పోస్టాఫీసు వద్ద నివాసముంటున్న రాజా అజయ్ మాథ్యూస్ తన ద్విచక్రవాహనాన్ని ఇంటి కాంపౌండ్‌లో పార్కింగ్ చేసి నిద్రించాడు. ఆదివారం తెల్లవారి చేసే సరికి వాహనం మాయమైంది. వాహనం చోరీకి గురైందని తెలుసుకున్న అజయ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దుండగుడిని గుర్తించేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

మంగళగిరి: నగరంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చోరీ ఘటన చోటు చేసుకుంది. సోమవారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బ్యాంక్ కాలనీలోని పాఠశాల గదిలో రాగి జావ కాచేందుకు, కోడిగుడ్లు ఉడకపెట్టేందుకు గ్యాస్ స్టౌ, సిలిండర్ ఉన్నాయి. రోజులాగే శనివారం సాయంత్రం స్టౌ, సిలిండర్‌లు గదిలో ఉంచి తలుపులు వేసి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా గది తలుపులు పగలగొట్టి స్టౌ, సిలిండర్ కనిపించకపోవడంతో చోరీ జరిగిందని తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

350 మందికి వైద్య పరీక్షలు



వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మేడికొండూరు : మండలంలోని జంగంగుంట్లపాలెంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు, స్పెషలిస్టులు, వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 350 మంది వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాస్‌శర్మ, మండల వైద్యాధికారి డాక్టర్ డి.అనిరుధ్, గ్రామ సర్పంచ్ కల్లి శ్రీదేవి సాంబిరెడ్డి, పలువురు స్పెషలిస్టు వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో రౌడీషీటర్ హల్‌చల్

- పోలీసులకు ముచ్చెమటలు పట్టించిన వైనం
- అరెస్ట్ చేస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపు
- ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలీసులను అడ్డుకుంటున్న రౌడీషీటర్ కుటుంబసభ్యులు, స్థానికులు



తలకు కట్టుతో రౌడీషీటర్ కత్తులోడు

మంగళగిరి: నగరంలో ఓ రౌడీషీటర్ కత్తి తీసుకుని హల్‌చల్ చేసి స్థానికులను భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు రోజంతా పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన ఘటన చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాప్టిస్ట్‌పేటకు చెందిన రౌడీషీటర్ బుల్లా ఏసుబాబు(కత్తు లోడు) ఆదివారం రాత్రి మద్యం తాగి కత్తి, రాడ్ తీసుకుని నగర పరిధిలోని ఎంఎస్ఎస్ కాలనీ, పాత మంగళగిరి ప్రాంతాలలో హల్‌చల్ చేస్తూ పలువురిపై దాడి చేశాడు. ఒకరికి తల పగిలి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల రాకతో రౌడీషీటర్ అక్కడ నుంచి ఉడాయించాడు. పోలీసులు వెంబడించగా బాప్టిస్ట్‌పేటలో ఓ నివాసంలో దాక్కున్నాడు. పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా రౌడీషీటర్ కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు అడ్డగించి పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అరెస్ట్ చేస్తారని భావించిన రౌడీషీటర్ ఇంటిలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నాటకానికి తెరతీశాడు. ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకుని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. రౌడీషీటర్ చేతిలో గాయాలపాలైన బాధితులు ఇరువురు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిరు వ్యాపారులకు బండ్లు అందజేత



ఇస్త్రీ బండ్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ ప్రధానకార్యదర్శి దుర్గారావు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని మహానాడులో ఇద్దరు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో ఇస్త్రీ బండ్లను వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్టీ సెల్ ప్రధానకార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు సోమవారం వారికి అందజేశారు. మహానాడు 21వ వార్డుకు చెందిన రాజమండ్రి శ్రీనివాస్, 22వ వార్డుకు చెందిన పిల్లుట్ల సోములులకు బండ్లు అందజేశారు. కార్యక్రమంలో 15వ సచివాలయ కన్వీనర్లు పల్లంటి ఈశ్వరి, సయ్యద్ సలాం, తారకరామ్, సీనియర్ నాయకులు పేరసాని రామకృష్ణ, సచివాలయ గృహ సారథులు కునుకు రామకృష్ణ, పజ్జూరి శ్రీనివాసరావు, ఎండీ బాజీ, కునుకు మోహన్‌సాయికుమార్, బి.మౌనిక, షేక్ ఖలీల్, ఎం.ఈశ్వరి, జె.సాయిలక్ష్మి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దుగ్గిరాల మండలం కంతంరాజు కొండూరు గ్రామానికి చెందిన తాడిబోయిన సాంబశివరావు అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సోమవారం అతని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించి ఎంపీటీసీ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని చేతుల మీదుగా మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, వీరవసంతరావు, కావూరి అశోక్, కొండూరు పెద్ద నాగేశ్వరరావు, వెంకయ్య దూరు, తాడిబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెదకొండూరు: గ్రామానికి చెందిన కొండూరు సుందరరావు అనారోగ్యంతో మృతిచెందగా అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే ఆర్కే రూ.10 వేలు అందజేశారు. ఆ మొత్తాన్ని మృతుడి కుటుంబసభ్యులకు ఎంపీటీసీ సభ్యులు కొండూరు సుమన్ అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, యాకోబు, సుద్దపల్లి జబ్బయ్య, యేసయ్య, కిరణ్ తదితరులు ఉన్నారు.

పోస్టల్ శాఖ సేవలు వెలకట్టలేనివి

- ఘనంగా ప్రపంచ తపాలా దినోత్సవం
- పోస్ట్‌మాస్టర్‌ను సత్కరించిన స్కౌట్స్ అండ్ గిల్డ్ సభ్యులు



పోస్ట్‌మాస్టర్ నాగప్రసాద్‌ను సత్కరిస్తున్న స్కౌట్స్ అండ్ గిల్డ్ సభ్యులు

తాడికొండ: ఇంటర్నెట్, ఫోన్ వ్యవస్థ లేని సమయంలో తపాలా శాఖ సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివని స్కౌట్స్ అండ్ గైడ్స్ గిల్డ్ సభ్యులు కొనియాడారు. ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ పోస్టాఫీసులో నిర్వహించిన వేడుకలలో వారు మాట్లాడుతూ పూర్వ కాలంలో సుదూర ప్రాంతాల్లో ఉన్న బంధువులకు లేఖల ద్వారానే కుశలతను తెలియపరిచేవారని, నాడు లేఖలు వచ్చాయంటే కుటుంబం మొత్తం ఆసక్తిగా చదువుకునే పరిస్థితి ఉండేదని, నేడు పెరుగుతున్న సాంకేతికతతోపాటు సౌకర్యాలు పెరిగిన నేపథ్యంలో తపాల శాఖ సేవలు ప్రతి ఒక్కరూ స్మరించుకొని భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తపాలా శాఖ ద్వారా నేడు ప్రజలకు బ్యాంకింగ్ రంగ సేవలు, ఆధార్ సేవలతోపాటు పలు ఇతర సేవలను చేరువ చేస్తుండటం అభినందనీయమన్నారు. తాడికొండ పోస్ట్‌మాస్టర్ నాగప్రసాద్‌ను స్కౌట్స్ అండ్ గైడ్స్ గిల్డ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో గిల్డ్ సభ్యులు జె సుబ్బారెడ్డి, ఎన్‌వీ సుబ్బారావు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఫాతిమా జీవితం స్ఫూర్తిదాయకం



ఫాతిమా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నేతలు

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): భారతదేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త షేక్ ఫాతిమా 1848లో తన ఇంటిలో మొదటి బాలికల పాఠశాల ఏర్పాటు చేసి, ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాల జెండా చెట్టు సెంటర్‌లో భారత దేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త షేక్ ఫాతిమా వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సుభాని మాట్లాడుతూ ఆనాటి అసమాతల సమాజంలో అడుగడుగునా వివక్ష ఎదుర్కొంటూనే బాలిక విద్య కోసం, మహిళల హక్కుల కోసం సావిత్రిబాయి పూలేతో కలసి షేక్ ఫాతిమా పోరాడారని అన్నారు. ఫాతిమా సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2022లో ఎనిమిదో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో ఆమె జీవితచరిత్రను చేర్చి తగిన గౌరవం కల్పించిందన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ ఖాసిం సాహెబ్, షేక్ రషీద్, పఠాన్ ఖాదర్, సయ్యద్ జలీల్, గాలేబ్ బేగ్, షేక్ బాజీ, షేక్ మస్తాన్‌వలీ, గురువిందపల్లి సుగుణరాజు, బులుసుపాటి యల్లేశ్వరరావు, కాకా వెంకటేశ్వర్లు, బొద్దులూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో తెనాలి చిన్నారుల నృత్యం



తెనాలి: కాణిపాకంలోని స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి తెనాలికి చెందిన శ్రీలక్ష్మీనారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ బృందం నృత్యాంశాల్ని ప్రదర్శించింది. గురువు పెసర్లంక వసంతదుర్గ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలకు అభినందనలు దక్కాయి. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు బాధ్యులు జ్ఞాపికల్ని అందజేశారు.

నగరపాలక సంస్థ ఉద్యోగులకు మెమోలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు చెందిన ఇద్దరు ఉద్యోగులకు కమిషనర్ కీర్తి చేకూరి మెమోలు జారీ చేశారు. అవుట్ సోర్సింగ్ కార్మికుల వివరాలు తెలియజేయాలని కొద్ది నెలల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు అడిగిన ప్రశ్నకు వివరాలను తప్పుగా ఇవ్వడంతో పాటు కౌన్సిల్‌ను తప్పుదోవ పట్టించిన అప్పటి ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ షాదిక్ పాషాను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంలో అప్పటి కౌన్సిల్ సమావేశంలో ఎలాంటి వివరాలు ఇచ్చారో తెలపాలంటూ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్, ఇంజినీరింగ్ సెక్షన్ ఈ–2 సుబ్బారావుకు మెమోలు జారీ చేశారు.